# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-04-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **భారత్... ప్రపంచానికి నాయకత్వం వహించగల,అభివృద్ధి చెందిన దేశంగా రూపొందుతోందని భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ పేర్కొన్నారు.**

**2.** **దేశ వ్యాప్తంగా నిన్న జరిగిన లోక్ సభ రెండవ దశ ఎన్నికలలో 60.96 శాతం పోలింగ్ నమోదైంది.**

**3.** **సార్వత్రిక ఎన్నికల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు అన్ని జిల్లాల పోలీస్ అధికారులు "సమర్థ్" మొబైల్ యాప్ ను వినియోగించాలని ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు.**

**4.** **విశాఖపట్నం నుంచి కౌలాలంపూర్‌కు అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి.**

**5.** **ఉభయ తెలుగు రాష్ట్రాలలో రాగల అయిదు రోజుల పాటు వడగాలులు వీస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది.**

==========================

భారత్... ప్రపంచానికి నాయకత్వం వహించగల,అభివృద్ధి చెందిన దేశంగా రూపొందుతోందని భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ పేర్కొన్నారు. హైదరాబాద్ లోని జీనోమ్ వ్యాలీలో ఉన్న భారత్ బయోటెక్ టీకాల యూనిట్ ను తెలంగాణ గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్తో కలిసి ఆయన నిన్న సందర్శించి.... టీకాల తయారీ విధానాన్ని తెలుసుకున్నారు. కొవిడ్ మహమ్మారిని ఎదుర్కొనటంలో భారత్ బయోటెక్ క్రియాశీలక పాత్ర పోషించిందని ఉప రాష్ట్రపతి ఈ సందర్భంగా కొనియాడారు.మన దేశంలో పరిశోధనారంగంలో పరిశ్రమలు, విద్యాసంస్థలు కలిసి పనిచేయాలని.. తద్వారా అన్ని విభాగాల్లో సరికొత్త మార్పులకు శ్రీకారం చుట్టాలని ఉప రాష్ట్రపతి పిలుపునిచ్చారు. ఇలా ఉండగా....ఉపరాష్ట్రపతి నిన్న తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. తరువాత తిరుపతి లోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం మూడవ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని,విద్యార్థులకు బంగారుపతకాలు,పట్టాలను ప్రదానం చేశారు.

--------------------------

ఈవీఎమ్, వీవీ ప్యాట్‌ల ఓట్ల లెక్కింపుపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్యానికి దక్కిన విజయంగా భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు , ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభివర్ణించారు. బీహార్ రాష్ట్రంలోని అరారియా పట్టణంలో నిన్న జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ... ఈవీఎమ్ లలో నమోదైన ఓట్లతో వంద శాతం వీవీ ప్యాట్‌ల స్లిప్పులను సరిపోల్చి లెక్కించాలని కోరుతూ దాఖలైన పిటిషన్ లను సుప్రీం

కోర్టు త్రోసి పుచ్చడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ రోజు ప్రజాస్వామ్యానికి గొప్ప రోజనీ, మన ప్రజాస్వామ్య విలువలను, ఎన్నికల ప్రక్రియను యావత్ ప్రపంచం కొనియాడుతోందని అన్నారు.

---------------------------

దేశ వ్యాప్తంగా 13 రాష్ట్రాలు,కేంద్రపాలిత ప్రాంతాలలోని 88 స్థానాలలో నిన్న జరిగిన లోక్ సభ రెండవ దశ ఎన్నికల పోలింగ్ స్వల్ప ఘటనలు మినహా ప్రశాంతంగా పూర్తయింది. ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. ఛత్తీస్ ఘడ్లోని పలు సమస్యాత్మక ప్రాంతాల్లో 3 గంటలకే పోలింగ్ ముగించారు. సమయం ముగిసినప్పటికీ పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లలో వేచి ఉన్నవారికి ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. మొత్తం 60.96 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. తొలి విడతలో 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 102 లోక్ సభ స్థానాలకు ఎన్నికలు జరగ్గా.. దాదాపు 65.5 శాతం పోలింగ్ నమోదైంది. మూడవ దశ ఎన్నికలు 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 94 నియోజకవర్గాల్లో మే 7న జరగనున్నాయి. మొత్తం ఏడు దశల్లో సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది.

---------------------------

సార్వత్రిక ఎన్నికల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు అన్ని జిల్లాల పోలీస్ అధికారులు “సమర్థ” మొబైల్ యాప్‌ను వినియోగించాలని ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. బాపట్ల జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖేష్ కుమార్ మీనాను కలిసి బాపట్ల జిల్లాలో ఉపయోగిస్తున్న సమర్థ్ మొబైల్ యాప్ విశిష్టతను వివరించారు. జిల్లా ఐటి కోర్ విభాగం రూపొందించిన ఈ యాప్ ను ప్రయోగాత్మకంగా ఈ నెల 22 వ తేదీ నుండి తమ జిల్లాలో వినియోగిస్తూ మంచి ఫలితాలను సాధిస్తున్నట్లు తెలిపారు. ఈ యాప్ ద్వారా ఒక్క నోటిఫికేషన్ తో జిల్లాలో వున్న 2000 మంది పోలీసులకు ఒకేసారి ఆదేశాలు జారీ చేయవచ్చని తెలిపారు.

---------------------------

తెలంగాణాలోని సంగారెడ్డి జిల్లా జహీరాబాదు పట్టణంలో ఫార్మా సిటీని ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. సంగారెడ్డిలో నిన్న జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ .... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 25 వేల మంది యువతకు ఉద్యోగాలు ఇచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటోందని, అధికారంలోకి వచ్చిన వంద రోజులలోనే అయిదు హామీలను అమలు చేసిందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు దేశం , జన సేన, భారతీయ జనతా పార్టీల కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్ర రైతుల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తుందని జన సేన అధ్యక్షుడు కె. పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలోని మలికిపురం పట్టణంలో నిన్న జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ..... రైతుల పంటలకు సరైన గిట్టుబాటు ధర కల్పిస్తామని ప్రకటించారు. సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందనీ, వచ్చే ఎన్నికలలో మార్పు జరగాలని ప్రజలు కోరుకుంటున్నారని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

---------------------------

విశాఖపట్నం నుంచి కౌలాలంపూర్‌కు అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి. ఎయిర్ ఏసియాకు చెందిన విమాన సర్వీసులు వారానికి మూడు రోజులు బుధ, శుక్ర, ఆదివారాల్లో అందుబాటులో ఉంటాయి. తొలిసర్వీసు లో భాగంగా నిన్న రాత్రి కౌలాలంపూర్ నుంచి విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకున్న ప్రారంభ విమానానికి కస్టమ్ వాటర్ కానన్ స్వాగతం లభించింది. విశాఖ విమానాశ్రయం నుండి ఇది మూడవ అంతర్జాతీయ విమాన సర్వీసు కాగా... సింగపూర్‌కు వారానికి 4 సార్లు, బ్యాంకాక్‌కు వారానికి మూడురోజులు విమాన సేవలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ క్యాలండర్ ప్రకటించకుండా నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేసిందని ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణాజిల్లా తిరువూరు పట్టణంలో నిన్న జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆమె మాట్లాడుతూ... గత ఐదేళ్లలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకపోవడం విచారకరమని అన్నారు. సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తామని చెప్పి..... ఆ మాటే విస్మరించారని అన్నారు. వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు అప్పుల పాలయ్యారనీ, మూడు వేల కోట్ల రూపాయలతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం .... ఆ మాటను నిలబెట్టుకోలేక పోయిందనీ షర్మిల అన్నారు.

---------------------------

2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు పాఠ్య పుస్తకాలు సిఎస్ఈ.ఏపీ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఒక ప్రకటనలో వెల్లడించారు. 2024-25 విద్యా సంవత్సరానికి 1,2 తరగతులు మినహా మిగతా అన్ని తరగతుల పాఠ్యపుస్తక ముఖచిత్రాలు మారనున్నాయని తెలిపారు. పాఠ్యాంశాలపై మరింత పట్టు సాధించేలా వేసవి సెలవుల్లో విద్యార్థులు చదివేలా ప్రోత్సహించాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు సూచించారు. ద్విభాషా పాఠ్యపుస్తకాల రూపంలో ఉన్న విజ్ఞాన శాస్త్ర, సామాజిక శాస్త్ర పాఠ్య పుస్తకాలను కథలుగా చదవడం ద్వారా సంబంధింత సబ్జెక్ట్‌లపై మరింత అవగాహన పెరగడమేగాక, ఆంగ్ల భాషా నైపుణ్యాలు సైతం మరింత మెరుగుపడతాయని ప్రవీణ్ ప్రకాష్ పేర్కొన్నారు.

---------------------------

ఉభయ తెలుగు రాష్ట్రాలలో రాగల అయిదు రోజుల పాటు తీవ్ర వడగాలులు వీస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది .ఆంధ్రప్రదేశ్ లోని రాయలసీమ లో ఐదు రోజుల పాటు వడగాలులు, కోస్తాంధ్ర లో ఈనెల 28 – 30వతేదీ మధ్య తీవ్ర వడగాలులు వీస్తాయనీ తెలిపింది. ఈ రోజు రాష్ట్రంలోని 64 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 183 మండలాల్లో వడగాడ్పులు వీస్తాయని విపత్తు నిర్వహణ సంస్థ పేర్కొంది. కాగా.. నిన్న అత్యధికంగా నంద్యాల జిల్లా చాగలమర్రిలో 45.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

అటు తెలంగాణాలో రాగల అయిదు రోజుల పాటు వడగాలులు వీస్తాయని హైదరాబాదు వాతావరణ శాఖ తెలిపింది. ఈ క్రమంలో పలు జిల్లాలకు ఆరంజ్ , ఎల్లో అలెర్ట్ ను జారీ చేసింది. తీవ్ర ఎండలు, వడగాలుల కారణంగా అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని హెచ్చరించింది. రాష్ట్ర వ్యాప్తంగా పొడి వాతావరణం ఏర్పడుతుండడంతో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం వుందనీ, అదే సమయంలో ఆది, సోమ వారాలలో పలు జిల్లాలలో వర్షాలు కురిసే అవకాశం ఉందని కూడా హైదరాబాదు వాతావరణ కేంద్రం పేర్కొంది.

---------------------------

ప్రభుత్వానికి పన్ను చెల్లించకుండా అక్రమంగా తరలించే వస్తువులను సెంట్రల్ గూడ్స్, సర్వీసెస్ ట్యాక్స్–సిజీఎస్‌టి నిర్మూలించే చర్యలు చేపడుతోంది. గుంటూరు సిజీఎస్‌టి కమీషనరేట్ సిబ్బంది ప్రజారోగ్యానికి హానికరంగా పరిణమించే అక్రమ సిగరెట్లను స్వాధీనం చేసుకుని, వాటిని నిన్న పల్నాడు జిల్లా యడ్లపాడులో విద్యుత్ ఉత్పత్తి చేసే జిందాల్ ప్లాంట్‌లో నిర్మూలించారు. సిజీఎస్‌టి కమీషనర్ సాధు నరసింహారెడ్డి ఈ సందర్భంగా ఆకాశవాణి తో ప్రత్యేకంగా మాట్లాడుతూ, గత ఆర్థిక సంవత్సరంలో ఆరుకోట్ల విలువైన అక్రమ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నామని, వాటిలో భాగంగా 1 కోటి 11 లక్షల రూపాయల విలువైన సిగెరెట్లను ధ్వంసం చేశామని వివరించారు.

======================